

1 నుంచి ఇంటి వద్దకే

- పింఛన్ల పంపిణీకి సన్నాహాలు
- సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను జులై 1 నుంచి ఇంటి వద్దకే పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు అధికారులు సన్నాహాలు చేపడుతున్నారు. పెంచిన పింఛన్‌తో పాటు మూడు నెలల అరియర్స్ కలిపి మొత్తం రూ.7వేలు సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు పంపిణీ చేపట్టనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 4.02 లక్షల మందికి ఈ మేరకు లబ్ధి చేకూరనుంది..

సామాజిక భద్రత పింఛన్లను రూ.4వేలు పెంచుతామని టిడిపి కూటమి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్‌ను జులై 1 నుంచి పంపిణీ చేయనున్నారు. పెంచిన పింఛన్‌తో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు నెలకు రూ.వెయ్యి చొప్పున బకాయితో కలిపి మొత్తం రూ.7వేలను లబ్ధిదారుల ఇంటి వద్దకే పంపిణీ చేయనున్నారు. సచివాలయ సిబ్బందితో పంపిణీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేపట్టారు. సచివాలయ పరిధిలో ఎంత మంది పింఛన్‌దారులు ఉన్నారు..ఎంత మంది సిబ్బంది పింఛన్ల పంపిణీకి అవసరం అవుతారు అన్న విషయాలపై కసరత్తు చేపడుతున్నారు. జులై 1న ఉదయం 6 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభించి సాధ్యమైనంత వరకూ ఆ రోజు సాయంత్రానికి లబ్ధిదారులందరికీ పింఛన్లను పంపిణీ చేసేలా చర్యలు చేపడుతున్నారు. వైసిపి ప్రభుత్వం మొత్తం 16 రకాల పింఛన్లను పంపిణీ చేయగా కూటమి ప్రభుత్వం ఆ పింఛన్ల సంఖ్యను 28 కేటగిరీలుగా విభజించింది. సామాజిక భద్రతా పింఛన్లతో పాటు దివ్యాంగులు, తలసేమియా, కిడ్నీ వ్యాధుల బాధితులు, ఇతర వ్యాధులు బాధితులను కేటగిరిలుగా విభజించారు. కర్నూలు జిల్లాలో 2,11,431 మంది పింఛన్‌దారులు, నంద్యాల జిల్లాలో 1,90,725 మంది పింఛన్‌దారులు మొత్తం ఉమ్మడి కర్నూలు జిల్లా కలిపి 4,02,156 మంది పింఛన్‌దారులు ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో జూన్‌లో పింఛన్ల పంపిణీకి రూ.175.60 కోట్లు ఖర్చు చేయగా పెంచిన పింఛన్, బకాయితో కలిపి జులై నెలలో రూ.351 కోట్లను పంపిణీ చేయనున్నారు. మొత్తం లబ్ధిదారుల్లో వృద్ధాప్య పింఛన్‌దారులే 2.41 లక్షల మంది ఉన్నారు. వీరికి జులై నెలలో రూ.7వేల చొప్పున పంపిణీ చేయనున్నారు. ఇందు కోసం రూ.169.37 కోట్లను కేటాయించనున్నారు. దివ్యాంగులకు గతంలో రూ.3వేలు ఉన్న పింఛన్‌ను టిడిపి కూటమి ప్రభుత్వం రూ.6 వేలకు పెంచింది. కర్నూలు జిల్లాలోని 31,764 మంది వికలాంగులకు, నంద్యాల జిల్లాలోని 24,077 మంది వికలాంగులకు మొత్తంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 55,841 మంది వికలాంగులకు ఈ పెంచిన పింఛన్‌ను అందించనున్నారు. ఇందు కోసం రూ.33.50 కోట్లను కేటాయించనున్నారు. పూర్తి వైకల్యం కలిగిన వికలాంగులకు గతంలో ఉన్న రూ.5వేల పింఛన్‌ను రూ.15 వేలకు పెంచారు. పక్షవాతం బారినపడి వీల్‌చైర్, మంచానికే పరిమితమైన వారికి, తీవ్రమైన కండరాల బలహీనత, ప్రమాదాల బారిన పడి పూర్తిగా వికలాంగులైన వారికి ఈ పెంచిన పింఛన్‌ను అందించనున్నారు. బోధకాలు, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, గుండె మార్పిడి, డయాలసిస్ రోగులకు గతంలో రూ.5వేల పింఛన్‌ను రూ.10వేలకు పెంచారు. జులై 1న వారికి కూడా పెంచిన పింఛన్‌ను అందించనున్నారు.

పింఛన్ లబ్ధిదారులు ఇలా..

కేటగిరీ	కర్నూలు	నంద్యాల
వృద్ధాప్య	1,27,022	1,14,944
వితంతు	71,599	62,821
ఒంటరి మహిళ	5,892	4,291
చేనేత	2,964	1,005
డప్పు కళాకారులు	1,464	2,927
చర్మకారులు	1,143	2,426
మత్స్యకారులు	821	1,810
హిజ్రాలు	244	246
కల్లుగీత కార్మికులు	243	232
కళాకారులు	39	23



కౌలు రైతులకు రుణాలివ్వండి

- పింఛన్ల పంపిణీకి సహకరించాలి
- జిల్లాస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ఇన్‌ఛార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



బ్యాంకర్లందరూ పెన్షన్ పంపిణీకి సంబంధించిన నగదు జులై 1వ తేది లోపు సంబంధిత బ్యాంక్ బ్రాంచులకు పంపించే విధంగా చర్యలు చేపట్టాలని ఇంచార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సంబంధిత బ్యాంక్ అధికారులను ఆదేశించారు. సిసిఆర్‌సి కార్డులో ఉన్న కౌలు రైతులందరికీ పంట రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను కోరారు. గురువారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి బ్యాంకర్స్ కన్సల్టేటివ్ కమిటీ (డిసిసి) సమావేశం ఇంచార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రైమరీ, ఎంఎస్ఎంఇ సెక్టార్ లకు రుణాలు మంజూరు చేయడంలో కొన్ని బ్యాంకు బ్రాంచులు పురోగతి సాధించడం లేదన్నారు. ప్రైమరీ, ఎంఎస్ఎంఇ సెక్టార్లు చాలా ముఖ్యమైన సెక్టార్లని వీటికి రుణాలు మంజూరు చేయడంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొన్ని ప్రైవేటు బ్యాంకులు అగ్రికల్చర్ సెక్టార్‌లో రుణాలు ఇవ్వడంలో చాలా తక్కువ పురోగతి సాధించారని వ్యవసాయం మీద రుణాలు ఇవ్వడంలో నిర్దేశిత లక్ష్యాలను సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని బ్యాంక్ అధికారులను ఇంచార్జ్ కలెక్టర్ ఆదేశించారు. ప్రధాన మంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్‌కు సంబంధించి బ్యాంక్‌ల వద్ద పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎస్ఆర్ రామచంద్ర రావు, నాబార్డ్ డిడిఎం సుబ్బారెడ్డి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ గిరిధర్ బెహేర, కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ సుశాంత్ కుమార్, యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ నరసింహారావు, డిఆర్‌డిఎ పిడి సలీం బాష, మెప్మా పిడి నాగశివ లీల, బ్యాంకుల అధికారులు, లీడ్ బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణకు ప్రణాళిక రూపొందించండి

- మంత్రి టిజి.భరత్



ఆర్‌అండ్‌బి అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నగరంలో రోడ్ల విస్తరణ చేపట్టేందుకు ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ తెలిపారు. ప్రభుత్వ అతిథిగృహంలో ఆర్ అండ్ బి శాఖ అధికారులతో రోడ్ల విస్తరణ, ట్రాఫిక్‌పై మంత్రి గురువారం సమీక్షించారు. జనాభాకు అనుగుణంగా రోడ్ల విస్తరణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాన సర్కిల్ అయిన రాజ్ విహార్‌లో ట్రాఫిక్ కష్టాలు తీవ్రంగా ఉన్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఇందుకోసం ఆనంద్ థియేటర్ ఎదురుగా ఉన్న హంద్రిబ్రిడ్జి వద్ద నుండి వాహనాలు మళ్లించేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అవసరమైతే ఫ్లై ఓవర్, అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించేందుకు అధ్యయనం చేయాలన్నారు. దీంతోపాటు రాజ్‌విహార్ జంక్షన్‌ను విస్తరించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు. కోర్టు భవనాలతో పాటు జడ్జిల నివాసాలు ఏ స్థితిలో ఉన్నాయో పరిశీలించి అవసరమైన మరమ్మతులు వెంటనే చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నగరంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను కూడా పరిశీలించి మరమ్మతులు చేయాలన్నారు. చిల్డ్రన్స్ పార్క్ నుండి వడ్డెగేరి, ఉస్మానియా కాలేజీ మీదుగా బుధవారపేట, కలెక్టరేట్ వరకు రోడ్డు విస్తరణ చేపట్టాలన్నారు. ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రజలు, దుకాణాదారులతో మాట్లాడి తగిన నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రజలు, ప్రభుత్వం పరస్పర అంగీకారంతో నగరంలో రోడ్డు విస్తరణ జరగాలని ఆదేశించారు. దీంతోపాటు కర్నూలు నుండి కల్లూరుకు వెళ్లే మార్గంలో ఉన్న వక్కెర వాగుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మించేందుకు స్టడీ చేయాలన్నారు. బళ్లారి చౌరస్తా వద్ద ట్రాఫిక్ నియంత్రణకు హైదరాబాద్ నుండి వచ్చే వాహనాలను ఎస్‌ఎపి క్యాంపులో వచ్చే విధంగా పరిశీలించాలని మంత్రి టిజి భరత్ అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు వేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బి ఎస్ఇ నాగరాజు, ఇఇలు సురేష్ బాబు, క్రిష్ణారెడ్డి, డిఇలు నాగరాజు, శివరుద్ర, రవిచంద్ర, వెంకటేశ్వర్లు, ఫణిరామ్, సుజాత, రుక్మిణి, తదితర అధికారులు పాల్గొన్నారు.

జింకల బెడద నుంచి రైతులను కాపాడాలి

- జింకల పార్కు ఏర్పాటు చేయాలి: ఎపి రైతుసంఘం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లాలో అనేక ప్రాంతాలలో జింకల నుండి పంట పొలాలు నష్టమవుతున్నాయి. వేసిన పంటను వేసినట్లు జింకలు మేసేస్తున్నాయి. ప్రభుత్వం, జిల్లా అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని రైతుల పంట పొలాలను కాపాడాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లాలోని ఆలూరు, ఆస్పరి, తుగ్గలి, పత్తికొండ, ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల, గూడూరు, కల్లూరు, ఓర్వకల్లు, మిడుతూరు మండలాలలో వేలాది జింకలు పంట పొలాలలో కనబడిన మొలకలన్నిటిని తినేసి రైతులకు తీవ్రమైన నష్టం చేస్తున్నాయని పేర్కొన్నారు. వీటిని అరికట్టాలని అనేకసార్లు జిల్లా అధికార యంత్రాంగానికి వినతి పత్రాలు ఇచ్చామని, ఆందోళనలు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినప్పటికీ ఏమాత్రం ఫలితం లేదన్నారు. 2014 సంవత్సరంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆలూరు ప్రాంతంలో జింకల పార్కు ఏర్పాటు చేసి రైతుల పంట పొలాలను కాపాడుతానని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ నెరవేరలేదని, తర్వాత వైఎస్.జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత జింకల సమస్యపై దృష్టి సారించలేదు. ఇప్పుడైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కర్నూలు జిల్లా రైతాంగాన్నీ జింకల బారి నుండి ఆదుకునేందుకు తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం ప్రజా దర్బార్‌లో జింకల సమస్యపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు బాధిత రైతులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

నేడు కలెక్టర్ రంజిత్ బాష బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా నూతన కలెక్టర్‌గా పి.రంజిత్‌బాష శుక్రవారం బాధ్యతలను స్వీకరించనున్నారు. ప్రస్తుతం బాపట్ల జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయన ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో కర్నూలు జిల్లా కలెక్టర్‌గా నియమితులయ్యారు. పి.రంజిత్‌బాష పక్కనే ఉన్న నంద్యాల జిల్లాలోని నందికొట్కూరు ప్రాంతానికి చెందినవారు. 2007 సంవత్సరంలో ఏపీపీఎస్సీ గ్రూప్ వన్ పరీక్షలో ఉత్తీర్ణతలై ఆర్‌డిఒగా ఎంపికయ్యారు. కడప , గుడివాడ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్‌గా విధులను నిర్వహించారు. అనంతరం పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా పని చేశారు. మంత్రి నారా లోకేష్‌కు ఒఎస్‌డి గా విధులను నిర్వహించారు. 2018లో ఐఎఎస్ పదోన్నతి పొంది విజయవాడ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించారు. అనంతరం కృష్ణాజిల్లా కలెక్టర్గా విధులు నిర్వహించి ఇప్పటివరకు బాపట్ల జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్నారు.



నూతన కలెక్టర్ గురించి...

నందికొట్కూరు పట్టణానికి చెందిన గోకారి సాహేబ్, హలీమాబీ దంపతులకు రంజిత్ బాషా 1975 ఆగస్టు 31న జన్మించారు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయారు. హలీమాబీ తన రెక్కల కష్టంతో కుమారుడిని చదివించారు. రంజిత్ బాషా నందికొట్కూరులోని సంతపేట పాఠశాలలో ఒకటో తరగతి నుంచి 7వ తరగతి వరకూ చదివారు. 8వ తరగతి నుంచి పదో తరగతి వరకూ ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గలోని ఎపి గురుకుల పాఠశాలలో విద్యను అభ్యసించారు. ఇంటర్, డిగ్రీ నందికొట్కూరు ప్రభుత్వ కళాశాలలో పూర్తి చేశారు. డిగ్రీ అనంతరం అనంతపురం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో 1999లో ఎమ్మెస్సీ మ్యాథ్స్, 2006లో సిక్కిం మణిపాల్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ కంప్యూటర్స్ పూర్తి చేశారు. ఆయనకు 2005లో భానుతో వివాహమైంది. వీరికి లతిష, హనీషా కుమార్తెలున్నారు.



భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్ : ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరణ చేసి కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ కోరారు. కార్మిక కర్షక భవన్ లో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం ఎస్.ఖాజాపాష అధ్యక్షతన నిర్వహించారు. పిఎస్.రాధాకృష్ణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె.సుధాకరప్ప మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా భవన నిర్మాణ కార్మికులు అనేక రకాలుగా నష్టపోయారని తెలిపారు. సంక్షేమ బోర్డు ఉన్న కార్మికులు సంక్షేమ పథకాలకు దూరమై అనేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉందని తెలిపారు. గత ప్రభుత్వంలో ఇసుక పాలసీ పేరుతో ఇసుక ప్రజలకు అందకుండా నిర్మాణాలు ఆగిపోయి కార్మికులు ఆత్మహత్యలు కూడా చేసుకున్న పరిస్థితి ఉందని తెలిపారు. కరోనా కారణంగా నష్టపోయిన కార్మికులకు నష్టపరిహారం చెల్లిస్తామని మాట ఇచ్చి మాట తప్పారని, దీనివల్లనే గత ప్రభుత్వం తీవ్రమైన నష్టాన్ని చూసి భవన నిర్మాణ కార్మికుల ఆగ్రహానికి గురి కావలసి వచ్చిందని తెలిపారు. అంతేకాకుండా సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులను గుర్తించి గుర్తింపు కార్డులు మంజూరు చేయడానికి వెంటనే జీవోలను విడుదల చేసి భవన నిర్మాణ కార్మికులకు న్యాయం చేయాలన్నారు. నగర అధ్యక్షులు ఆర్.నరసింహులు, ఎస్.అబ్దుల్లా జి .ఏసు, ఎం. నాగరాజు, ఎంజె. ఈశ్వరమ్మ, శ్రీనివాసులు, ఎస్. రహిమాన్, శ్రీను హాజరయ్యారు.

త్వరలో కుల ధ్రువీకరణ పత్రాలు జారీ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో విఆర్‌ఒల ద్వారా వెరిఫికేషన్ చేయించిన తరువాత కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తామని ఇన్చార్జి జిల్లా కలెక్టర్ నారపురెడ్డి మౌర్య గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి కులాలకు సంబంధించి ఇంకా 2,29,685 మంది కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకోని వారు ఉన్నారని సిసిఎల్‌ఎ ఆదేశానుసారం ఈరోజు నుంచి విఆర్‌ఒ ద్వారా ఇంటింటి సర్వే చేయించి వారి కులం, మొబైల్ నెంబర్ తదితర పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. , నమోదైన వివరాలను ఆయా తహశీల్దార్లు కుల ధ్రువీకరణ చేసిన తర్వాత ఆయా కులాలకు సంబంధించిన వారికి కుల ధ్రువీకరణ పత్రాలు ఆటోమేటిక్‌గా జనరేట్ అవతాయన్నారు. జనరేట్ అయిన ధ్రువీకరణ పత్రాలను సచివాలయల ద్వారా పొందవచ్చునని ఇంచార్జ్ కలెక్టర్ తెలియజేశారు.

సామూహిక మరుగుదొడ్లకు తాళం

ఇబ్బందులు పడుతున్న మహిళలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని మూడవ వార్డు బండిమెట్ట లోని సామూహిక మరుగుదొడ్లకు తాళం చేయడంతో మహిళలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. అందులో మహిళల మరుగు దోడ్లు కావడంతో సమస్య జటిలంగా మారిందని సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, ఎస్ఎండి షరీఫ్‌లు విమర్శించారు. గురువారం సిపిఎం బృందం పర్యటించి అక్కడ సమస్యలు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్ల మరమ్మతు పేరుతో తాళం చేయడం సరైనది కాదన్నారు. ఇంకా టెండర్ వెయ్యలేదని, అప్రూవల్ కాలేదని, బిల్లులు అయినా ఇవ్వలేదని, పని స్టార్ట్ చేస్తాం అనే పేరుతో సామూహిక మరుగుదొడ్లు బ్లాక్ చేయడంతో ఇక్కడ తీవ్రమైన సమస్య ఏర్పడిందని తెలిపారు. బండి మెట్ట సామూహిక మరుగుదొడ్లను సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు డి. పార్వతయ్య అధ్యక్షతన, ఎం రాజశేఖర్, ఎస్ఎండి షరీఫ్,అబ్దుల్ దేశాయ్ , ఆవార్డు శాఖ కార్యదర్శి షేక్షావలి, గౌస్ బాషా ,రాజు మద్దిలేటి, నూర్ భాషా తదితరులు కలిసి బండి మెట్టలో సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు ఇబ్బందికరమైన సామూహిక మరుగుదొడ్లను లాక్ చేయడం సరైనది కాదన్నారు. రిపేరు చేసే సందర్భంగా అప్పుడు లాక్ చేయాలే తప్ప ఇప్పటినుంచి బ్లాక్ చేసి మహిళలకు ఇబ్బంది కలిగించకూడదని సిపిఎం నాయకులు అధికారులకు సూచించారు. అధికారులు తగిన చర్యలు తీసుకొని బండి పెట్టలోని మహిళలకు సమస్య రాకుండా చూడాలని డిమాండ్ చేశారు.



సామూహిక మరుగుదొడ్లను పరిశీలిస్తున్న సిపిఎం బృందం

నేడు పురపాలక శాఖ మంత్రి రాక

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ అధ్యక్షతన శుక్రవారం ఉదయం 11:00 గంటలకు రాష్ట్ర సచివాలయంలో జరుగనున్న అధికారుల సమీక్షకు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవ్ తేజ, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పాల్గొననున్నారు. డయేరియా, కార్పొరేషన్ ఆర్థిక స్థితి వంటి వివిధ అంశాలపై మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, విభాగాల అధిపతులో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించనున్నారు. దీనికి రాష్ట్రంలోని నగరపాలక సంస్థల కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులు హాజరుకానున్నారు.

గౌరు దంపతులకు టిడిపి నాయకుల సన్మానం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత కు 33వ వార్డు టిడిపి నాయకులు సన్మానించారు. కర్నూలు నగరం మాధవి నగర్ ఎమ్మెల్యే స్వగృహంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డిని, టిడిపి సీనియర్ నాయకులు నందికొట్కూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి గౌరు వెంకటరెడ్డిని 33వ వార్డు పాత కల్లూరు టిడిపి నాయకులు కలిసి ఘనంగా సత్కరించారు. అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన ఫోటోను బహుకరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పవన్‌కుమార్, నాగరాజు, రాఘవేంద్ర, రఘురాం, ఇస్మాయిల్, పొలిరెడ్డి పాల్గొన్నారు.



అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన ఫొటో బహూకరణ

జిజిహెచ్ లో అర్ధరాత్రి విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎపిఎంఐడిసి ఇంజనీర్లతో మాట్లాడి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ
సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్


కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని దీన్ని విద్యుత్ అధికారులతో సంప్రదించి మరమ్మతులు చేశామని ఆస్పత్రి సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గురువారం పవర్ సరఫరాపై ఎపిఎంఐడిసి ఇంజనీర్లతో, ఎలక్ట్రికల్ ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరిన్‌టెన్‌డెంట్ ఛాంబర్ లో విద్యుత్ సరఫరాపై ఎపిఎంఐడిసి, ఎపిఎస్‌ఇబి ఇంజనీర్లతో, ఎలక్ట్రికల్ ఇంజనీర్లతో సమీక్షించామన్నారు. ఆసుపత్రిలో నిన్న రాత్రి 1.00 గంటల సమయంలో విద్యుత్ సరఫరాలో టెక్నికల్ ప్రాబ్లం వచ్చిందన్నారు. విషయం తెలుసుకున్న వెంటనే అర్ధరాత్రి ఆసుపత్రికి వచ్చి 2 గంటలకు నుంచి 5 వరకు అక్కడే ఉండి విద్యుత్ సిబ్బందితో మరమ్మతులు చేయించామన్నారు. ఆసుపత్రిలో న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్ ట్రాన్స్‌ఫార్మర్ పనులు మొదలుపెట్టారని, త్వరలో అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో ఎలక్ట్రికల్ మ్యాన్ పవర్ షార్టేజ్ వల్ల కొందరికి కాంట్రాక్ట్ బేసిక్ కింద తీసుకోవాలని చీఫ్ ఇంజనీర్‌కు ప్రపోజల్‌ను సిద్ధం చేసి పంపామని తెలిపారు. ఆసుపత్రిలో విద్యుత్ వల్ల ఏదైనా టెక్నికల్ ప్రాబ్లం వస్తే దానిని మా దృష్టికి తీసుకొస్తే వెంటనే దాన్ని పరిష్కరిస్తానని తెలిపారు. ఎపిఎంఐడిసి ఇఇ శివకుమార్, ఎపిఎస్‌పిడిసిఎల్ డి ఇ జయరాంరెడ్డి, ఎఇ జాన్, తదితరులు పాల్గొనారు.



విద్యుత్ అధికారులతో సమీక్షిస్తున్న డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం



ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ


మాట్లాడుతున్న మాజీ ఎంపీ బుట్టా రేణుక

కార్యకర్తలకు అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట, మాజీ ఎంపీ బుట్టా రేణుక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, మాజీ ఎంపీ, నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక తెలిపారు. గురువారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో జడ్‌పిటిసి, ఎంపిపి, వైస్ ఎంపిపి, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని, ఓటమి గెలుపునకు నాంది అని తెలిపారు. కార్యకర్తలు అధైర్య పడొద్దని, టిడిపి అబద్ధపు ప్రచారాలు వైసిపి ఓటమికి కారణమని చెప్పారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో రైతులకు ఎంతో మేలు కలుగుతుందని, ఈ యాక్ట్‌ను కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. ఈ యాక్ట్ బాగుందని టిడిపి ప్రభుత్వం అసెంబ్లీలో మద్దతు తెలిపి, ఎన్నికల ముందు ఈ యాక్ట్‌పై ప్రజలను తప్పుదోవ పట్టించి ప్రజలు నమ్మే విధంగా అపోహలు సృష్టించారని విమర్శించారు. జగనన్న ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటారని, జగనన్న అబద్ధపు హామీలు చెప్పరని, చేసేదే చెబుతారని వివరించారు. కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉండి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. వైసిపి మండల కన్వీనర్ బిఆర్.బసిరెడ్డి, సోగనూరు భీమిరెడ్డి, బుట్టా నీలకంఠ, యువ నాయకులు బుట్టా ప్రతుల్ పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించండి

- పీడీ అమర్‌నాథ్ రెడ్డి


మాట్లాడుతున్న పీడీ అమర్‌నాథ్ రెడ్డి

ప్రజాశక్తి - దేవనకొండ

గ్రామాల్లో పండ్ల తోటల పెంపక రైతులను గుర్తించి ఉపాధి హామీ చట్టం కింద అందిస్తున్న వివిధ రకాల ఉచిత పండ్ల మొక్కలపై అవగాహన కల్పించి సాగు చేసేలా ప్రోత్సహించాలని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. గురువారం దేవనకొండ సిఎల్‌ఆర్‌సి భవనంలో క్లస్టర్ లెవెల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్న, సన్నకారు రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు హార్టికల్చర్ ఎంతో దోహదం చేస్తుందని తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించిన వారవుతారని చెప్పారు. ఏపీడీ ఫక్కీరప్ప, ప్లాంటేషన్ మేనేజర్ నందకుమార్ పాల్గొన్నారు.

టిడిపితోనే అభివృద్ధి

- ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్

ప్రజాశక్తి - హాలహర్వి

టిడిపితోనే అభివృద్ధి సాధ్యమని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్రగౌడ్ తెలిపారు. గురువారం మండలంలోని నిట్రవట్టి గ్రామంలో వీరభద్ర గౌడ్, టిడిపి నాయకుల సమక్షంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రూ.3 లక్షలతో డ్రెయినేజీతో కూడిన సిసి రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపితోనే అభివృద్ధి జరుగుతుందని, గ్రామాల్లో అభివృద్ధి లేక ఐదేళ్లయిందని తెలిపారు. టిడిపిలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పని చేస్తానని చెప్పారు. ఆలూరును అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. వేదవతిని త్వరగా పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానన్నారు. పార్టీకి అంకితభావంతో పని చేసిన నాయకులను మరిచిపోనని, వారందరికీ న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు. పెంచిన పింఛను డబ్బులను లబ్ధిదారుల ఇంటి వద్దకే అందజేస్తామన్నారు. టిడిపి మండల కన్వీనర్ సుధాకర్, క్లస్టర్ ఇన్‌ఛార్జీ పాల్ రెడ్డి, హరి రెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు బసవరాజు పాల్గొన్నారు.

టిడిపి జెండాను ఆవిష్కరిస్తున్న వీరభద్ర గౌడ్, నాయకులు


ఒకరిద్దరు పార్టీ మారితే వైసిపికి నష్టమేమీ లేదు

- మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఒకరిద్దరు పార్టీ మారడం వల్ల వైసిపికి వచ్చే నష్టమేమీ లేదని మాజీ ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక నివాసంలో వైసిపి మున్సిపల్ కౌన్సిలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత 20 ఏళ్లుగా తాగునీటి కొరత లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నియోజకవర్గ ప్రజల దాహార్తి తీర్చామని తెలిపారు. 2004లో నియోజకవర్గంలో తాగునీటి సమస్యను కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, 104 బసాపురంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణం కోసం నిధులు కేటాయించి నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. ఈ ఏడాది కూడా వర్షాల వల్ల ఆధారపడడం కంటే కర్ణాటక నుంచి వచ్చే తాగునీరు వాటా ప్రకారం 7 టిఎంసిల నీటి విడుదలకు సిద్ధమయ్యారని తెలిపారు. అధికారులతో కూడా మాట్లాడామని చెప్పారు. ప్రస్తుత ఎమ్మెల్యే పార్థసారథి తాగునీటి అవసరాల కోసం దాదాపు రూ.30 కోట్లు మంజూరు చేయించుకుని బసాపురం ఎస్-ఎస్ ట్యాంకు మరమ్మతులు త్వరగా చేయించి ప్రజల దాహార్తిని తీర్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు. ఆలస్యం చేస్తే సమయానికి నీరందక ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వస్తుందని చెప్పారు. ఆదోని మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 42 మంది కౌన్సిలర్లకు గాను 41 మంది వైసిపి కౌన్సిలర్లు ఉన్నారని తెలిపారు. అందులో ఒకరిద్దరు వెళ్లినంత మాత్రాన పార్టీకి, మున్సిపాలిటీకి కానీ ఎలాంటి ఇబ్బందీ లేదని చెప్పారు. మున్సిపల్ ఛైర్మన్ బి.శాంత, వైస్ ఛైర్మన్ నరసింహులు, 38 మంది వైసిపి వెంటే ఉంటారని తెలిపారు. పార్టీలో పాతనీరు పోతే కొత్త నీరు వస్తుందని చెప్పారు. తన రాజకీయ జీవితంలో 15 ఏళ్లు ప్రజా పాలన చేశానని, గతంలో ఐదేళ్లు ప్రజల పక్షాన నిలబడి సమస్యలపై పోరాటం చేశానని తెలిపారు. ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయడంలో వెనుకంజ వేసేది లేదని చెప్పారు. మూడు పార్టీల నాయకులు రాష్ట్రంలో అనేక పథకాలను ఎలా అమలు చేస్తారో వేచి చూద్దామని తెలిపారు. లారీ అసోసియేషన్ ఎన్నిక విషయంలో అధికార పార్టీ నాయకులు అత్యుత్సాహం చూపారని చెప్పారు. ఆ ఎన్నికలను ఎమ్మెల్యే పార్థసారథి వ్యతిరేకించడం సరైనది కాదని తెలిపారు. ఎవరు అధికారంలో ఉంటే వారు వివిధ అసోసియేషన్‌లో పని చేయడం సహజమేనని చెప్పారు. కూటమి ఐక్యత ఈ లారీ అసోసియేషన్ విషయంలో బయటపడిందని తెలిపారు. లారీ అసోసియేషన్‌కు సహాయ, సహకారాలు అందించడంలో తాను ముందుంటానని చెప్పారు. వైసిపి సీనియర్ నాయకులు చంద్రకాంత్ రెడ్డి, గోపాల్ రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

30న ఉచిత కంటి పరీక్ష శిబిరం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ, ఆర్య వైశ్య అఫీసియల్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శాంతిరామ్ హాస్పిటల్, ఆరోగ్యశ్రీ సౌజన్యంతో ఈనెల 30న ఆదోనిలోని అరుణ్‌జ్యోతి నగర్ శ్రీహరళయ్య స్వామి గుడి వద్ద ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి ఆపరేషన్లు చేస్తున్నట్లు ఆ సంఘం మాజీ అధ్యక్షులు నగేష్ కాకుబాళ్, అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్ గుప్తా తెలిపారు. గురువారం ఆదోనిలోని కార్యాలయంలో ఉచిత శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నంద్యాల శాంతిరామ్ హాస్పిటల్‌లో ఉచిత ప్రయాణ సౌకర్యంతో ఆపరేషన్లు చేయిస్తామన్నారు. నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపాలనే సంకల్పంతో గతంలో కూడా వందల మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. సంతానం లేని వారికి ఉచిత వైద్య పరీక్షల శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని కంటి చూపు సరిగా లేనివారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాయకంటి రఘు, కోశాధికారి యాతగిరి వెంకటేశ్వర్లు, డాక్టర్ రంజిత్ కుమార్, వామ్ అండ్ ఆవోపా మహిళా విభాగ్ అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు మమతశ్రీ, నాయకంటి శ్రీదేవి, దండల అనూష పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న నిర్వాహకులు

రోడ్డుకిరువైపులా చెట్లను తొలగించండి

- ముళ్లచెట్లు రోడ్డులోకి ఉన్నా పట్టించుకోని అధికారులు

- ప్రమాదాలు జరిగితేనే పట్టించుకుంటారా..?

ప్రజాశక్తి - చిప్పగిరి

ఆర్‌అండ్‌బి రోడ్లకు ఇరువైపులా ముళ్ల చెట్లు అడ్డంగా ఉన్నా వాటిని తొలగించడం లేదని ద్విచక్ర వాహనదారులు ఆర్‌అండ్‌బి అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాలు వచ్చినప్పుడు చిన్న వాహనాలు పోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నామని వారు పేర్కొంటున్నారు. రోడ్డు విడిచి వెళ్లినప్పుడు ముళ్ల చెట్లు తగులుతున్నాయని, అలాంటప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు తెలుపుతున్నారు. ముఖ్యంగా రైతులు ఎద్దుల బండ్లతో పోయే సమయంలో కూడా చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. చిప్పగిరి నుంచి ఆలూరుకు వెళ్లే ఆర్‌అండ్‌బి రహదారిలో చాలా చోట్ల ముళ్ల చెట్లు రోడ్డులోకి వచ్చాయని, ఆర్‌అండ్‌బి అధికారులు జెసిబిల ద్వారా తొలగించడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి రోడ్డుకిరువైపులా ఉన్న ముళ్ల చెట్లను జెసిబిల ద్వారా తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.


రోడ్డుకు అడ్డంగా ఉన్న ముళ్ల చెట్లు

విరమణ ఉపాధ్యాయురాలికి ఘన వీడ్కోలు

ప్రజాశక్తి - మంత్రాలయం

విరమణ పొందిన ఉపాధ్యాయురాలు చంద్రకళావతమ్మకు ఘనంగా వీడ్కోలు పలికారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ సబ్జెక్టు ఉపాధ్యాయులు చంద్రకళావతమ్మ విరమణ సందర్భంగా వీడ్కోలు, సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. విద్యార్థుల మనస్సుల్లో అభిమానంతో చెరగని ముద్ర వేసుకున్న వారే ఉత్తమ ఉపాధ్యాయులని పేర్కొన్నారు. కర్నూలుకు చెందిన చంద్రకళావతమ్మ ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో ప్రయివేట్ టీచర్‌గా పని చేస్తూ ప్రభుత్వ ఉద్యోగిగా కర్నూలు జిల్లాలోని ఉయ్యాలవాడలో తొలిసారి ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టారని తెలిపారు. పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో విరమణ పొందడం ఆమెకు దొరికిన భాగ్యమని పేర్కొన్నారు. సుమారు 26 ఏళ్ల పాటు విధి నిర్వహణలో ఎంతో మంది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ బదిలీపై వెళ్లే సమయంలో ఎవరైతే విద్యార్థుల కళ్లల్లో నీళ్లు చూస్తామో వారు అదృష్టవంతులని తెలిపారు. అంత దగ్గరగా విద్యార్థుల మనస్సులో స్థానం సంపాదించుకున్నట్లని చెప్పారు. అనంతరం విరమణ పొందిన చంద్రకళావతమ్మకు, ఆమె భర్త కృష్ణ గౌడ్‌కు శాలువా, పూలమాలలు వేసి జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు హంపయ్య, ఉపాధ్యాయులు రామన్న, విఠోబా రావు, చంద్రశేఖర్, నాగభూషణం, గోపాల్, బసవరాజు, సత్యనారాయణ, ఈరన్న, హరి, శ్రీనివాసులు, రామకృష్ణ, అనురాధ, సంధ్యారాణి, సువర్ణ, పుష్పలత, ఉమామహేశ్వరి, సుల్తానా పాల్గొన్నారు.


ఉపాధ్యాయురాలు దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కౌలు రైతులను ఆదుకోవాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ప్రజాశక్తి - ఆదోని

అధిక పెట్టుబడులు పెట్టి ఇబ్బందుల్లో ఉన్న కౌలు రైతులను ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, రైతు సంఘం సీనియర్ నాయకులు లక్ష్మ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఎపి రైతు సంఘం, కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిపిఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సొంత భూమిలేని నిరుపేద రైతులు కౌలుకు తీసుకొని వ్యవసాయం సాగిస్తూ పండ్ల తోటలు, కూరగాయలు, వివిధ రకాల వాణిజ్య పంటలను సాగు చేసి జీవిస్తున్నారని తెలిపారు. రైతులు, కౌలు రైతులకు 90 శాతం రాయితీతో విత్తనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, రైతు సంఘం మండల కార్యదర్శి ఎల్లప్ప, సిపిఐ పట్టణ కార్యదర్శి సుదర్శన్, కౌలురైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సత్యనారాయణ, డికెఎంయు మండల అధ్యక్షులు కంగన్న, సిపిఐ పెద్దకడబూరు మండల కార్యదర్శి వీరేష్, ప్రజానాట్యమండలి నాయకులు శివ రాములు, ఎఐటియుసి నాయకులు షేక్షావలీ, ఎఐవైఎఫ్ పట్టణ అధ్యక్షులు రమేష్, బసాపురం ఈరన్న, చిన్న హరివాణం మల్లేష్, దొడ్డనకేరి శంకరయ్య పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న నాయకులు

ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలి

- ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ మహదేవప్ప

ప్రజాశక్తి - ఆదోని

ఉపాధ్యాయులపై యాప్‌ల భారాన్ని తగ్గించాలని ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్ బి.మహదేవప్ప, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసి.సుంకన్న, జిల్లా కార్యదర్శి బి.గోపాల్, జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు బి.రామాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం ఆదోనిలోని ఎస్‌టియు భవన్‌లో ఆదోని, కౌతాళం మండలాల సమావేశం నిర్వహించారు. ఆదోని మండల ప్రధాన కార్యదర్శి బి.సుధాకర్ బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాల నుంచి ప్రధానోపాధ్యాయులకు ఫోన్లు వస్తున్నాయన్నారు. యాప్‌ల భారం ద్వారా విద్యా వ్యవస్థలో ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరిగి విద్యాబోధనకు ఆటంకం కలుగుతోందని వాపోయారు. నూతన ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చే తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే ఇచ్చి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరిపి ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తికనుగుణంగా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నూతన డీఎస్సీలో అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఎస్‌టియు ఆదోని మండల అధ్యక్షులు చింతకుంట రామకృష్ణ, కౌతాళం మండల నాయకులు పి.అంజినయ్య, కోటేశ్వరయ్య, ఎస్‌టియు సీనియర్ నాయకులు ఎం.సూర్యుడు, వి.రామాంజనేయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మహదేవప్ప


IN THE COURT OF THE HON'BLE CIVIL JUDGE (SENIOR DIVISION) AT ADONI
E.P.No. 14/2021 IN O.S.NO. 1/2015

Between:-
Smt. Leelavathi (died) by L.Rs.
Mekala Linganna & others. ...Decree-Holders
Vs
K.Eranna. ... Judgement-debtor

TO
K.Eranna S/o Kamma Yedurinti Adeppa,
Resident of Amruthapuram village in Halaharvi Mandalam of Kurnool District

Please take notice that the above named decree-holders filed the above E.P. for recovery of the decreetal amount by way of sale of the E.P. Schedule landed property. You are hereby informed to appear before this Hon'ble Court in person or through Pleader on 01.08.2024 at 10.30 A.M. If you got any objection attend this Hon'ble Court on that day to file your claim objections failing which the matter will be decided in your absence.

A.LAKSHMI NARAYANA
ADVOCATE FOR DECREE-HOLDERS
CELL NO.9652482161

పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

- ఎంపిడిఒ సుబ్బరాజు

ప్రజాశక్తి - కౌతాళం



కలెక్టర్ ఆదేశాల మేరకు 1న ఎన్‌టిఆర్ భరోసా పింఛను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంపిడిఒ సుబ్బరాజు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. వృద్ధులు వితంతువులు, వికలాంగులు, హిజ్రాలు, డయాలసిస్ పింఛనుదారులకు 1న ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు అందించడానికి అధికార యంత్రాంగాన్ని సిద్ధం చేశామన్నారు. మండలంలో 30 పంచాయతీల్లోని 8,719 పింఛనుదారులకు, మొత్తం రూ.5,96,78,000 అందిస్తామని తెలిపారు. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఉదయం 6 గంటలకు పింఛను పంపిణీ చేయాలని సూచించారు. పింఛన్లు పంపిణీ చేసే సిబ్బంది ఈనెల 29న పింఛను డబ్బులను బ్యాంకు ద్వారా విత్ డ్రా చేసి సిద్ధంగా ఉండాలని ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు.

జెబిపికి రంగన్న రాజీనామా

ప్రజాశక్తి - ఆదోని



2024 ఎన్నికల్లో జై భీమ్ రావు భారత్ పార్టీ తరపున నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశానని, కొన్ని అనివార్య కారణాల వల్ల పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు మాజీ కౌన్సిలర్ కల్లుబోతుల రంగన్న తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. అధిష్టానానికి చరవాణి ద్వారా తన రాజీనామా నిర్ణయాన్ని తెలిపానని అన్నారు. భవిష్యత్తు కార్యాచరణ త్వరలో ప్రకటిస్తానని తెలిపారు.

ప్రతి పౌరునీ రక్షణ మా బాధ్యత

- ఎమ్మెల్యే పార్థసారథి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని ప్రతి పౌరునీ రక్షణ తన బాధ్యతగా భావిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. గురువారం ఆదోనిలోని గెస్ట్ హౌస్‌లో గ్రౌండ్ నట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి వ్యాపార సమస్యలను వివరించారు. లారీల బాడుగులకు సంబంధించిన సమస్య, వైఎంకె నల్ల గేట్ దగ్గర అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణ సమస్యను విన్నవించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ... త్వరలో లారీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్, గ్రౌండ్ నట్ వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం గురించి అధికారులతో మాట్లాడతానని తెలిపారు. ప్రతి వ్యాపారీ నిజాయితీగా వ్యాపారం చేసుకోవాలని సూచించారు. కష్టమొస్తే అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అసోసియేషన్ పెద్దలు శరణప్ప, కె.తాతప్ప, కె.మల్లికార్జున పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోనిరూరల్ : ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని మండల లెవెల్ స్టాక్ పాయింట్ రేషన్ గోదామును ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి గురువారం తనిఖీ చేశారు. రేషన్ బియ్యంపై విమర్శలు రావడంతో ఆయన కేంద్రాన్ని తనిఖీ చేసి బియ్యం బస్తాల తూకాలను పరిశీలించారు. తక్కువ తూకాలు ఉండడంపై ఆయన ఆరా తీశారు. తనిఖీ సమయంలో స్టాక్ పాయింట్ మేనేజర్ రవీంద్రనాథ్ రెడ్డి అందుబాటులో లేకపోవడంతో ఆయనపై అధికారులకు ఫిర్యాదు చేశారు. తక్షణమే ఆయనను సస్పెన్షన్ చేయాలని అధికారులను కోరారు. తహశీల్దార్ తాహెరా సుల్తానా, సిఎస్‌డిటి వలీబాషా ఉన్నారు.


తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే పార్థ సారథి

సర్దుబాటు పేరుతో ప్రాథమిక విద్యను బలి చేయవద్దు

- పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య

ప్రజాశక్తి - ఆదోని

మిగులు ఉపాధ్యాయులను గుర్తించి సర్దుబాటు పేరుతో ప్రాథమిక విద్యను బలి చేయవద్దని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య నాయకులు అనిల్ కుమార్, ప్రతాప్ రెడ్డి తెలిపారు. గురువారం ఆదోనిలోని మండగిరి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో పట్టణ ఉపాధ్యక్షులు బడుగు బసవరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మూడు ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలు మూతపడినప్పటికీ విద్యాశాఖ అధికారులు ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ కోసం, విద్యార్థుల సంఖ్యకు తగినట్లు ఉన్నత పాఠశాలల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపకపోవడం వల్ల నేడు ఈ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. అధికారులు పంచాయతీ రాజ్ విద్యా వ్యవస్థ మాదిరిగా మున్సిపల్ విద్యా వ్యవస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. నాయకులు జంగం బసవరాజు, కోటన్న, దస్తగిరి, మద్దయ్య, సురేష్ కుమార్, భాస్కరాచారి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు


హుండీ లెక్కింపును పర్యవేక్షిస్తున్న మేనేజర్

హుండీ లెక్కింపు పూర్తి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠం హుండీ ఆదాయం లెక్కింపు ప్రక్రియ పూర్తయినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు కానుకల రూపంలో హుండీలో వేశారని తెలిపారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ జిల్లా అధికారులు, శ్రీమఠం అధికారుల సమక్షంలో సేవాదారులతో కలిసి శ్రీమఠం ఆవరణలోని గురురాజాంగణ భవనంలో లెక్కింపు ప్రక్రియ చేపట్టామని పేర్కొన్నారు. 30 రోజుల హుండీ ఆదాయం నగదు రూపంలో రూ.3,41,46445 రాగా, బంగారం 82 గ్రాములు, వెండి 2570 గ్రాములు వచ్చినట్లు తెలిపారు. నగదును బ్యాంకులో జమ చేసినట్లు పేర్కొన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో ప్రముఖులు

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామిని ప్రముఖులు దర్శించుకున్నారు. గురువారం రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై ఆలయం చేరుకున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లుకు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావుకు సహాయక పిఆర్‌ఒ హొన్నాళ్లి వ్యాసరాజాచార్ స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళహారతులు స్వీకరించారు.

అంగన్వాడీ కొత్త భవన నిర్మాణం

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని నాగలదిన్నె గ్రామంలో ఆర్‌డిటి (రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్) సహాయంతో అంగన్వాడీ కేంద్రం భవనాన్ని రూ.16,37,272తో కొత్తగా నిర్మించారు. ఈ భవనాన్ని సర్పంచి భర్త తిమ్మప్ప, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, అంగన్వాడీ టీచర్స్ ఆధ్వర్యంలో ఆర్‌డిటి ఏరియా టీమ్ లీడర్ నాగ సుదర్శన్ రెడ్డి, సిఒ ప్రతాప్‌లు కొత్తగా నిర్మించిన అంగన్వాడీ కేంద్రం భవనాన్ని వారికి అప్పగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. ఆర్‌డిటి సహాయంతో అంగన్వాడీ భవనాన్ని నిర్మించినందుకు సంతోషంగా ఉందని తెలిపారు. చిన్నపిల్లలు ఆరోగ్యకరమైన వాతావరణంలో చదువు సాగించటానికి ఈ చక్కటి భవనం ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామస్తుల తరపున ఆర్‌డిటి సంస్థకు ధన్యవాదాలు తెలిపారు.


అంగన్వాడీకి సెంటర్ అప్పగిస్తున్న సభ్యులు



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి రవి

అధిక ఫీజులపై చర్యలు తీసుకోవాలి

- ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి రవి

ప్రజాశక్తి - ఆస్పరి

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడారు. మండలంలోని ప్రయివేట్ విద్యాసంస్థల యాజమాన్యం ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అధికంగా వసూలు చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం దుర్మార్గమని తెలిపారు. పాఠశాలలకు ఎలాంటి ఆటస్థలం, విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు లేకుండా పాఠశాలలు నిర్వహిస్తున్నారని చెప్పారు. విద్యా శాఖాధికారులు వెంటనే స్పందించి పాఠశాలలపై చర్యలు తీసుకుని ఫీజులు తక్కువ తీసుకునేలా చూడాలని కోరారు. లేకపోతే విద్యా శాఖాధికారుల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మహేష్, శివ, రవి, తరుణ్ పాల్గొన్నారు.

సకాలంలో పంట రుణాలివ్వాలి

- ఆర్‌ఐకి సిపిఐ, రైతుసంఘం వినతి

ప్రజాశక్తి- దేవనకొండ

ఈఏడాది ఖరీఫ్‌లో రైతులకు అన్ని విధాలుగా ప్రభుత్వం నుంచి సబ్సిడీల ద్వారా రావాల్సిన విత్తనాలు, ఎరువులు, ప్రభుత్వ రుణాలు సక్రమంగా ఇవ్వాలని సిపిఐ, రైతుసంఘం నాయకులు కోరారు. గురువారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో దేవనకొండ తహశీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మద్దిలేటి శెట్టి, సిపిఐ మండల కార్యదర్శి ఎం.నరసారావు మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ మొదలైందని, ఈఏడాది ప్రభుత్వం రైతులకు సరిపడినంత విత్తనాలు ఇవ్వలేదని తెలిపారు. 90 శాతం సబ్సిడీపై విత్తనాలు ఇవ్వాలని కోరారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి పెరిగిన ధరలకు పెట్టుబడులకు, అనుగుణంగా పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి వి.రాజశేఖర్, గుడిమిరాళ్ల శాఖ కార్యదర్శి తుకారం, రైతు సంఘం నాయకులు ఈరన్న, ఉరుకుందు, తిక్కయ్య, వీరాంజనేయులు, మద్దిలేటి, నల్లచెలమల శాఖ కార్యదర్శి భూపేష్, ఎఐఎస్‌ఎఫ్ మండల అధ్యక్షులు మధుబాబు పాల్గొన్నారు.

IN THE COURT OF THE IIND ADDL DISTRICT JUDGE, KURNOOL AT ADONI
I.A.NO.500/2023 IN O.S.No.32/2015

Between:
Dowlath Bee and another. ...Petitioners
V/s
T.Mahaboob Basha. ...Respondent

To, D15,
B.Kota Reddy S/o.B.Bheemeswara Reddy,
Hindu, H/no:1/1249, Geetha nagar,
Yemmiganur, Kurnool(d)

Take notice that the above petitioners have filed a petition under order 1 rule 10 of CPC to bring the proposed parties as defendants in the above suit for partition and separate possession.

The above petition is posted to 31.07.2024 for your appearance in the above said court, you are hereby required your personal attendance or through pleader to contest the said petition. If you are failed in appearance the matter may be decided exparte. The above said petition may be called by the Hon'ble court at 10.30 am on. 31.07.2024.

\\By order of the court//

M.Yaseen Basha,
Advocate for petitioners,
Adoni.
Cell NO. 7901558842

మహారాజశ్రీ కర్నూలు రెండవ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఓ.యస్. నెం.548/2023

నీలిషికారి జనుకు. ...వాది

- ఎదురి -

ఎం/ఎస్.శంకర్ కన్స్ట్రక్షన్స్ మరియు డెవలపర్స్ రిప్రజెంటెడ్ బై జి.మల్లారెడ్డి. ...ప్రతివాదులు

5,6,7ప్రతివాదులకు దావా సుమన్లు

1. ఎ.బాబు తండ్రి సంజీవరెడ్డి పసుపుల గ్రామం, కర్నూలు మండలం, కర్నూలు జిల్లా.
2. స్వర్ణకారి నాగన్న తండ్రి పెద్ద పాపన్న, ఇంటి. నెం. 46/73 బుధవారపేట, కర్నూలు సిటీ
3. స్వర్ణకారి వెంకటస్వామి, తండ్రి పెద్ద పాపన్న, ఇంటి.నెం. 46/73 బుధవారపేట, కర్నూలు సిటీ

పై నెంబర్ దావాలో వాది, తనకు పెద్దల నుండి వారసత్వంగా వచ్చినటువంటి ఆస్తిలో తనకు రావలసిన వాటా ఆస్తిని ఇవ్వమని ప్రతివాదులైన మీ పైన పై కోర్టులో దావా దాఖలు చేసినారు . ఇందులో 5,6,7 ప్రతివాదులు అయిన మీకు కోర్టు నుండి పలుమార్లు సమన్లు పంపినను మీరు తీసుకోనందున కోర్టు వారు ఈ పత్రిక ద్వారా సమన్లు తెలియజేయమని ఉత్తర్వులు ఇచ్చి ఉన్నారు. కావున మీకు ఏమైన అక్షేపణ ఉన్న 05-7-2024 వ తేది పగలు 10.30 గంటలకు పై కోర్టులో మీరు గానీ మీ తరపు వకీలు గానీ పైకోర్టులో హాజరై తెలుపుకోవలెను. లేని యడల సదరు దావా నీ పరోక్షమున విచారించి తీర్మానింపబడునని తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా : 05-7-2024

కుమారి సి.ప్రియాంక,
వాది పరం అడ్వకేటు,
నందికొట్కూరు.